ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## కేరళలో మృత్యుకేళి

మట్టిదిబ్బలకు 294 మంది బలి

గ్రౌండ్ జీరోలో రాహుల్, ప్రియాంక

2లో..

సంపుటి: 2 | సంచిక: 113 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 2 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

### అసెంబ్లీలో సబిత కన్నీరు..
### సీఎం రేవంత్‌పై కొడుకు కార్తీక్
## సంచలన ట్వీట్



రాజేంద్ర నగర్,ఆగస్టు 01(ప్రభాత ఉదయం):అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కన్నీరు పెట్టుకున్న విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆవేదన చెందారు.సీనియర్ ఎమ్మెల్యేను అని కూడా చూడకుండా మాట్లాడారని భావోద్వేగానికి లోనయ్యారు.తాజాగా ఈ పరిణామంపై సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ స్పందించారు.ఈ మేరకు సోషల్ మీడియా(ఎక్స్) వేదికగా ఓ పోస్టు పెట్టారు.“సరే రేవంత్ అన్న.. 2019 సంవత్సరంలో మేము నిన్ను వదిలి పార్టీ మారాము అనేది మీ బాధ అయితే? ఆరోజు మీ కనుల ముందు కాంగ్రెస్ పార్టీలో కొంతమంది పెద్దలు మిమ్మల్ని మేము పార్టీలోకి తీసుకొచ్చాం అని అక్కసుతో నన్ను,మా అమ్మని నానా ఇబ్బందులు పెడుతున్నప్పుడు,వాళ్ళు నన్ను,మా కుటుంబాన్ని రాజాకీయ సమాధి చేయాలి అని ప్రయత్నం చేసినప్పుడు మీరు ఎక్కడికి పోయారు అన్నా? అందరికీ నోరారా ‘మా అన్న రేవంత్ అన్న’ అని చెప్పుకున్న నన్ను,నాకు అవసరం ఉన్నప్పుడు ఒక అండగా ఉండాల్సిన సమయంలో నన్ను అనాధగా వదిలి వెళ్ళింది మీరు కాదా అన్నా? 2018 సంవత్సరంలో నా రాజకీయ భవిష్యత్ కోసం ఒక మాట సహాయం చేయండి అన్నా అని వేడుకుంటే,”నా చేతిలో ఏమి ఉంది” అని చెప్పి నాగుండెకు మానలేని గాయం చేసింది మీరు కాదా అన్నా? పార్టీలు మారినా ఎప్పుడూ మీరూ,వదినమ్మ బాగుండాలి అని కోరుకున్న వాళ్ళము మేము,మీ నాశనము ఎప్పుడు కోరుకోలేదు మేము.బాధ అనేది మీకు ఎంత కలిగిందో దానికి రెట్టింపు బాధ నాకు కలిగింది అన్న.ఎవరికి ఎవరు మోసం చేశారు.ఎవరి వల్ల ఎవరికి లాభం జరిగింది అనేది ఆ దేవుడికి తెలుసు అన్న” అని ట్విట్టర్‌లో కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు.



# త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు

### విధివిధానాల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ

హైదరాబాద్, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలపై ప్రధానంగా చర్చించిన అమాత్యులు, రేషన్ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ముగిసింది. దాదాపు 2 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించిన అమాత్యులు పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన ఏర్పాటు కానున్న ఈ సబ్ కమిటీ రేషన్ కార్డుల జారీకి సంబంధించి విధి విధానాలను రూపొందించనుంది. ఈ క్రమంలోనే రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు విడిగా ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించారు. జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి సైతం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ విలీన కమిటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు సభ్యులుగా ఉంటారు. దీంతో పాటు గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గౌరవెల్లి ప్రాజెక్ట్ పెండింగ్ పనుల పూర్తి కోసం రూ.437 కోట్ల విడుదలకు పచ్చజెండా ఊపింది. గౌరవెల్లి ప్రాజెక్టుకు నిధుల కోసం చొరవ తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కేబినెట్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులకు త్వరలోనే మోక్షం : కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలపై మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించారు. 6 గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ కార్డునే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజల నుంచి డిమాండ్ ఏర్పడింది. అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో 2 రోజుల క్రితం ప్రకటించారు. ఈ మేరకు రేషన్ కార్డుల జారీకి అర్హతలు, విధి విధానాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. అనంతరం కొత్త రేషన్ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన

..మిగతా 2లో

## సైబరాబాద్‌కు దీటుగా బెగరికంచ

స్కిల్ యూనివర్సిటీతో కొత్త నగరం

హెల్త్, స్పోర్ట్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తాం

స్కిల్ వర్సిటీ శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రంగారెడ్డి, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త నగరాన్ని నిర్మించనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గత పాలకులు హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌ను నిర్మిస్తే.. బెగరికంచను నాలుగో సిటీగా ఈ ప్రభుత్వం నిర్మించనుందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని హెల్త్, స్పోర్ట్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తామన్నారు. అనేక పరిశ్రమలను ఇక్కడి తీసుకొస్తామని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన

..మిగతా 2లో

## తెలంగాణలో రెండురోజులు భారీ వానలు

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

2



### అతి త్వరలో జాబ్ క్యాలెండర్
## ప్రకటిస్తాం

స్కిల్ వర్సిటీ ద్వారా 2లక్షల ఉద్యోగాలు భర్తీ

అసెంబ్లీలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లు

ఉద్దేశ్యాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. స్కిల్ వర్సిటీ ద్వారా రాబోయే రోజుల్లో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. శాసనసభలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2 లక్షల ఉద్యోగాలు కల్పించినా.. మరో 20 లక్షల మంది ఉపాధి కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ప్రభుత్వ పరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదు. గ్రాడ్యుయేట్లలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు కొరవడ్డాయి. వారిలో స్కిల్స్ పెంపుపై పారిశ్రామిక వేత్తలు, వీసీలు, విద్యార్థులతో చర్చించాం. 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' స్థాపనకు ప్రతిపాదిస్తున్నాం అని అన్నారు. విదేశాలకు వెళుతున్న విద్యార్థులు సరైన స్కిల్స్ లేకపోవడంతో రాణించలేకపోతున్నారని, అది గమనించి సిఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారని అన్నారు. అన్ని కోర్సులు 50 శాతం ప్రాక్టికల్ కాంపోనెంట్ కలిగి ఉంటాయి. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం

..మిగతా 2లో

## బీఆర్ఎస్ నల్ల బ్యాడ్జీలతో నిరసన



సిఎం ఛాంబర్ ముందు బైఠాయించి ఆందోళన

అరెస్ట్ తరలించిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవమానకరంగా వ్యాఖ్యలను చేశారని నిరసిస్తూ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. సీఎం ఛాంబర్ ఎదుట ధర్నా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారు. మహిళలను అవమానపరచిన సీఎం రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో వెల్‌లో బైఠాయించగా.. మర్షల్ వారిని అసెంబ్లీ వెలుపలకు తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు వాహనంలో అసెంబ్లీ నుంచి తరలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురి సభ్యులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. శాసనసభలో

..మిగతా 2లో

## ఫాస్టాగ్ కొత్త రూల్స్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) తీసుకొచ్చిన ఫాస్టాగ్ కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త రూల్స్ ప్రకారం మూడు నుంచి ఐదేండ్ల క్రితం జారీచేసిన ట్యాగ్‌లకు ఈ ఏడాది అక్టోబర్ 31లోగా తప్పనిసరిగా అప్‌డేట్ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఐదేండ్ల కంటే పాతవైన ఫాస్టాగ్‌లను మార్చుకోవాల్సి ఉంటుంది. యజమానులు తమ ఫాస్టాగ్‌లను రిజిస్ట్రేషన్, ఛాసిస్ నంబర్లకు డెడ్‌లైన్‌లోగా లింక్ అయ్యేలా చూసుకోవాల్సి ఉంటుంది. కొత్త వాహనాల యాజమానులైతే రిజిస్ట్రేషన్ నంబర్లను 90 రోజుల్లోగా అప్‌డేట్ చేయాలి. 30 రోజుల గడువులోగా చేయకపోతే బ్లాక్‌లిస్టులో పెడతారు.






### ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు
## పచ్చజెండా

ఉపవర్గీకరించడానికి రాష్ట్రాలకు అధికారం

సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు పచ్చజెండా ఊపింది. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ సమర్థనీయం. ఎస్సీలు చాలా వెనుకబడిన వర్గాలుగా ఉన్నట్లు ఆధారాలున్నాయి. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వర్గీకరణ ఆవశ్యకత ఉంది... అని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను ఉపవర్గీకరించేందుకు రాష్ట్రాలకు అధికారం ఉందని తేల్చిచెప్పింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో గురువారం చారిత్రాత్మక తీర్పు వెల్లడించింది. ఉపవర్గీకరణకు

..మిగతా 2లో

# నిరసనలతో హోరెత్తిన డైరీ ఫార్మ్ చౌరస్తా



పీడీపీ చౌరస్తా కు పాదయాత్రగా వెళ్తున్న గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పి. అర్చన జయప్రకాష్



పీడీపీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, తదితరులు

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని డైరీ ఫార్మ్ చౌరస్తా లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాష్ , రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి , సీనియర్ నాయకులు డి రమేష్ ముదిరాజ్ , శ్రీ నోముల రాము యాదవ్ , మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ ల ఆధ్వర్యంలో కార్యకర్తలతో నిన్న నిండు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి పై వ్యక్తిగత విమర్శలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంను అడుగడుగునా పోలీసులు అడ్డుకొని నాయకులను కార్యకర్తలను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా, శాంతి యుతముగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న మమ్మల్ని అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి పోతాయి కానీ పోలీస్ అధికారులు మాత్రం ప్రతిపక్షాల నిరసనను,హక్కులను అణిచివేస్తామంటే ఊరుకునే సమస్య లేదన్నారు. నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి పై చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పి అసెంబ్లీ రికార్డ్ నుంచి తొలగించాలని కోరారు.. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్ష కైనా వెనుకాడమని తెలిపారు.. ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూనిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అక్కెం రఘు యాదవ్, సోమ శ్రీనివాస్ గుమ్మడి కుమార్, మహేందర్ ముదిరాజ్ అరుణ్ ముదిరాజ్ సురేష్ ముదిరాజ్, బద్దం శ్రీకాంత్ రెడ్డి, కార్తీక్, ప్రవీణ్ మహేష్ ముదిరాజ్, శివ ముదిరాజ్, మైసిరెడ్డి, రాజు, సంతు,మహిళా నాయకురాలు లక్ష్మి నాయకులు కార్యకర్తలు , సబితమ్మ అభిమానులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నాం

### ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలు

### అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన

హైదరాబాద్, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం తీర్పును సిఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. మాదిగ, మాదిగ ఉ పకులాల యువకులు 27 ఏళ్లుగా పోరాటం చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో శాసనసభలో సీఎం కీలక ప్రకటన చేశారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకుని వస్తామని అన్నారు. వర్గీకరణ కోసం గతంలో ఇదే శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. అప్పుడు నాతో పాటు సంపత్‌కుమార్‌ను సభ నుంచి బహిష్కరించారు. గత ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ అంశంపై ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పింది. అలా తీసుకెళ్లకుండా మాదిగ సోదరులను మోసం చేశారు. డిసెంబర్ 3, 2023న ప్రజాప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో శాసనసభ్యులు, అడ్వొకేట్ జనరల్ ను దిల్లీకి పంపించాం. న్యాయ కోవిదులతో చర్చించి వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలమైన వాదనను కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు అనుకూలమైన తీర్పు ఇచ్చింది. సుప్రీం రాజ్యాంగ ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. దేశంలోనే అందరికంటే ముందు భాగాన నిలబడి ఏబీసీడీ వర్గీకరణ చేసే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేస్తాం. దీనికి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాదిగ సోదరులకు న్యాయం చేస్తాం. మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు సంపూర్ణంగా సహకరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను అని సీఎం కోరారు. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

# కేరళలో మృత్యు కేళి

### మట్టిదిబ్బలకు 294 మంది బలి

### గ్రౌండ్ జీరోలో రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): కేరళలోని వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 300కు చేరువైంది. మృతుల్లో 25మంది చిన్నారులు, 70మంది మహిళలున్నారు. 230మందికి పైగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దాదాపు 200 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. వారి కోసం సైన్యం, నేవీ, బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సందర్శించారు. కేరళలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతి చెందినవారి సంఖ్య 294కు చేరింది. మండక్కై, చూరాల్‌మల, అత్తమాల, నూల్పుజ ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగున్నాయి. సైన్యం, నేవీ, ఇతర సహాయ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యాయి. ఇప్పటివరకు వందలాది మందిని కాపాడి సురక్షిత శిబిరాలకు తరలించారు. వర్షాల కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ వరసగా మూడో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బురదలో కూరుకుపోయిన బాధితులను గుర్తించేందుకు ఆర్మీ జాగిలాలతో అన్వేషిస్తున్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో 200మందికి పైగా మృతిచెందారని డీఐజీ మొహసేన్ షాహిదీ తెలిపారు. 234మంది గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. దాదాపు 200 మంది ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో సురక్షితంగా బయటపడ్డ కొందరు ప్రజలు ఆ భయానక అనుభవాన్ని పంచుకున్నారు. సోమవారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో పెద్ద శబ్దం వినిపించిందని బాధితులు తెలిపారు. కిటికీలోంచి చూడగా పెద్ద ఎత్తున నీరు తమ ఇళ్ల వైపు రావడం కనిపించిందని చెప్పారు. ప్రాణాలు కాపాడుకునేందుకు డాబాలపైకి వెళ్లామనీ అక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లేందుకు గానీ మరొకరిని కాపాడేందుకు గానీ వీలు లేకుండా పోయిందని వివరించారు. సెల్‌ఫోన్లను వదిలి ఇళ్లపై కప్పుల పైకి వెళ్లడం వల్ల ఎవరికీ సమాచారం ఇవ్వలేకపోయామని చెప్పారు. కొండచరియలు విరిగిపడిన చూరల్‌మలలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ పర్యటించారు. సహాయక చర్యలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని సహాయక శిబిరాలు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోయిన బాధితుల్ని చూస్తుంటే తనకు ఎంతో బాధ కలుగుతోందని అన్నారు రాహుల్ గాంధీ. బాధితులకు సముచిత సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనను జాతీయ విపత్తుగా అభివర్ణించారు రాహుల్. "నా దృష్టిలో ఇది జాతీయ విపత్తు. ప్రభుత్వం ఏం చెబుతుందో చూద్దాం." అని వ్యాఖ్యానించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రెస్క్యూ ఆపరేషన్‌పై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది సేవల్ని ఆయన కొనియాడారు. మరికొన్ని రోజులు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగనున్నట్టు విజయన్ తెలిపారు. సమన్వయంతో పని చేసేందుకు నలుగురు మంత్రులతో కూడిన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినట్టు చెప్పారు.



# ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు పచ్చజెండా

మొదటి పేజీ తరువాయి...

సంబంధించి 2004లో సుప్రీంకోర్టు 'ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్' కేసులో ఇచ్చిన తీర్పు చెల్లదని తేల్చిచెప్పింది. ఉపవర్గీకరణ చేపట్టే రాష్ట్రాలు- అందుకు సహేతుక కారణాలు చూపాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనంలో జస్టిస్ బేలా త్రివేది మాత్రమే విభేదించగా మిగిలిన ఆరుగురు ఉపవర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడించారు. మెజారిటీ తీర్పుతో తాను విభేదిస్తున్నానని, రాజ్యాంగంలోని 341వ అధికరణ కింద నోటిఫై చేసిన ఎస్సీ జాబితాను మార్చే అధికారం రాష్ట్రాలకు లేదని జస్టిస్ బేలా త్రివేది అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి ఫిబ్రవరిలో కేంద్రం తన అభిప్రాయాన్ని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గీకరణ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. అప్పుడే ప్రభుత్వాలు సరైన పథకాలు రూపొందించగలవు.. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న కల ఉపవర్గీకరణ ద్వారా సాకారం అవుతుంది... అని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు తీసుకురావడం వెనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే కోటా హేతుబద్ధీకరణ చాలా ముఖ్యమని వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ కోటా రిజర్వేషన్లలో 50శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజికవర్గాలకు తొలి ప్రాధాన్యంగా ప్రత్యేకిస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ చట్టం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. షెడ్యూల్డ్ కులాల జాబితాలోకి ఏదైనా సామాజిక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉంటుందని, రాష్ట్రాల శాసనసభలకు కాదని ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు 2004లో తీర్పు చెప్పింది. దాన్నే పంజాబ్, హరియాణా తమ ఉత్తర్వులో హైకోర్టు ప్రస్తావించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం దీనిపై మరో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కూడా ఇందులో వ్యాజ్యదారుగా ఉన్నారు. ఈ పిటిషన్లను విచారించిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. 2020లో ఈ వివాదాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. దీనిపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఏడాది ఆరంభంలో విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఉపవర్గీకరణ చేసుకొనేలా రాష్ట్రాలకు అనుమతినిస్తూ గురువారం కీలక తీర్పు వెలువరించింది.




## సైబరాబాద్‌కు దీటుగా బెగరికంచ

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 57 ఎకరాల్లో రూ.150 కోట్ల వ్యయంతో వర్సిటీ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం విలువైన భూముల్ని ప్రభుత్వానికి ఇచ్చారని, ఇక్కడ వర్సిటీ నిర్మించి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి.. ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న ప్రధాన సమస్య నిరుద్యోగమని, పట్టభద్రులైన వారిని ఈ స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా మార్చనున్నట్లు చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టుతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని, రంగారెడ్డి జిల్లాలో భూముల విలువ పెరిగిందని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్? హయాంలో ఓఆర్ఆర్ నిర్మించడం వల్లే ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయన్నారు. రైతుల త్యాగాలకు ఫలితం ఉండాలంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాట వేస్తామన్నారు. స్కిల్ యూనివర్శిటీకి భూమి ఇచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుని ప్రపంచంతో యువతతో పోటీ పడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. వృత్తి నైపుణ్యం లేకపోవడంతో పట్టాలు ఉన్నా ఉద్యోగాలు దొరకడం లేదన్న రేవంత్ దేశానికి ఆదర్శంగా నిలపాలనే ఉద్దేశంతో స్కిల్ వర్సిటీ రూపకల్పన చేసినట్టు తెలిపారు. ఏడాదికి రూ.50వేలు నామ మాత్రపు ఫీజుతో కోర్సుల శిక్షణ అందించనున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా ఉచితంగా అందిస్తామని అన్నారు.

# బీఆర్ఎస్ నల్ల బ్యాడ్జీలతో నిరసన

మొదటి పేజీ తరువాయి...

విపక్షం గొంతునొక్కారన్నారు. ఎన్నిసార్లు కోరినా స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇన్ని ఆంక్షలు లేవని, తెలంగాణ ఉద్యమంలో లేని ఆంక్షలు శాసనసభలో చూడడం దురదృష్టకరమన్నారు. ఇవాళ ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందన్నారు. ముమ్మాటికి ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాల్సిందేనని.. అప్పటి వరకు విడిచిపెట్టేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్ అంటూ కేటీఆర్ నినదించారు. మరోవైపు శాసనసభలో మూడుగంటలుగా నిల్చొని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కోవ లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి నిరసన తెలిపారు. సీఎం క్షమాపణలు చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# తెలంగాణలో రెండురోజులు భారీ వానలు

హైదరాబాద్, ఆగస్ట్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల మూడురోజులు స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పలు జిల్లాల్లో వీస్తాయని పేర్కొంది. అలాగే, గురువారం నుంచి శుక్రవారం వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, జగితాల్య, ఆదిలాబాద్, వనపర్తి, సిరిసిల్ల, సూర్యాపేట, ములుగుతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైందని టీజీ డీపీఎస్ వివరించింది.

# త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి...

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, 'ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను తప్పక నెరవేరుస్తాం. త్వరలో పేదలకు తెల్ల రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభిస్తాం. పేదలకు విడివిడిగా తెల్లరేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇస్తాం. రేషన్ కార్డుల జారీ విధి విధానాల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు జరిగింది. క్రీడాకారులు ఈషా సింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌కు 600 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించాం. విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ కుమారుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం, మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్- 1 ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం' అని వెల్లడించారు.

# అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం

మొదటి పేజీ తరువాయి...

ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. స్కిల్ యూనివర్సిటీ ఉపాధి కల్పిస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని పెంచుతుంది. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు ఊతమిస్తుంది. 2024-25 సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులకు.. వచ్చే ఏడాది 10వేల మందికి శిక్షణ ఇస్తాం. ముచ్చర్లలో స్కిల్ వర్సిటీ కోసం శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నాం అని మంత్రి తెలిపారు. నిరుద్యోగులు, యువతలో స్కిల్స్ పెంపుపై పారిశ్రామికవేత్తలు, వీసీలు, విద్యార్థులతో చర్చించామని.. రాష్ట్రంలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ' స్థాపనకు ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 4 వేల ఎకరాల్లో నగరం రూపుదాలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడారు. రాజధానిలో మరో నూతన నగరం నిర్మిస్తామని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ఇలా 3 నగరాలున్నాయని.. ముచ్చర్ల నాలుగో నగరంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. అక్కడ ఆరోగ్య, క్రీడా హబ్స్‌తో పాటుగా.. మెట్రోతో అనుసంధానిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకూ పలు రంగాలపై నూతన విధానాలు రూపొందిస్తామని సీఎం స్పష్టం చేశారు. ముచ్చర్లలో ఏర్పాటు చేసే నగరంలో వైద్య సేవల నుంచి ఉపాధి వరకూ అన్నీ లభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు.

మరోవైపు, తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గురువారం బీఆర్ఎస్ నేతలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి అసెంబ్లీలో బుధవారం మహిళలపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్రభుత్వం బిల్లులు ప్రవేశపెడుతున్నా.. ఇంకోవైపు బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సభలో గందరగోళం



నెలకొంది. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. అటు, బుధవారం నాటి అంశంపై మాట్లాడేందుకు అవకాశం అడిగిన బీఆర్ఎస్ మహిళా నేతల విజ్ఞప్తిని స్పీకర్ తిరస్కరించారు.

# ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయ సమ్మతమే



రాజేంద్రనగర్ లోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బుద్వేల్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి రాజేంద్రనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మిఠాయిలు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చు అంటూ సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు చెందిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలోని ఆరుగురు న్యాయమూర్తులు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్పును వెల్లడించారు. దీంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని ఎమ్మార్పీఎస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు సైతం వారికి మద్దతుగా రాజేంద్రనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకులు :

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశానికి సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు బుద్వేల్ లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి రాజేంద్రనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎమ్మార్పీఎస్ నాయకులు వనం నరసింహ మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ , పోతరాజు యాదయ్య మాదిగ, నసాగారి రామ్ చందర్ మాదిగ, లింగని కృష్ణ మాదిగ, అనుముల జాన్ పాల్ మాదిగలు నాయకత్వం వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ నేతలు డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ శ్రవణ్, దుద్దు పోచయ్య, అప్పారెడ్డిగూడెం మహేందర్ లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

### బీజేపీ ఆధ్వర్యంలో.....

బీజేపీ నాయకులు జోగి రవి ఆధ్వర్యంలో డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా చేసుకోవచ్చు అంటూ సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ రాజేంద్రనగర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత మోర్చా నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకల్లో అత్తాపూర్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ , నాయకులు వై శ్రీధర్, కోరని సదానందం, కోరని క్రాంతి , కాడెం సుధాకర్ , గుంజ బాబురావు, ఎస్. విజయ్ తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిష్ణు దేవ్‌వర్మను కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి

## గవర్నర్‌ను తెలుగుదేశం పార్టీ తరపున కలసి శుభాకాంక్షలు తెలిపిన సామ భూపాల్ రెడ్డి

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన జిష్ణు దేవ్ వర్మ ను తెలుగుదేశం పార్టీ తరపున ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి రాజ్ భవన్ లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.




టీవీఎస్ అపాచే ఆర్‌టీఆర్ 160 బ్లాక్ ఏడిషన్‌ను ఆవిష్కరించిన వన్ టీవీఎస్

## మార్కెట్‌లోకి టీవీఎస్ అపాచే ఆర్‌టీఆర్ 160 బ్లాక్ ఏడిషన్

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ అత్తాపూర్ చౌరస్తాలో గల వన్ టీవీఎస్ కంపెనీ గురువారం టీవీఎస్ అపాచే ఆర్ టీ ఆర్ 160 బ్లాక్ ఎడిషన్ ను విడుదల చేసింది.



ఈదమ్మ దేవాలయం వద్ద అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## రాజేంద్రనగర్ ఈదమ్మ దేవాలయంలో అన్న దానం

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ప్రధాన రహదారిలోని శ్రీ ఈదమ్మ, శ్రీ భూలక్ష్మమ్మ అమ్మ వార్ల దేవాలయం లో ప్రతీ సంవత్సరం మాదిరిగా బోనాల పండుగ రోజు వచ్చిన ఓడి బియ్యం మహా ప్రసాదం గురువారం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.



అన్నదానం

## ములుగు పర్యటనలో తెలంగాణ గవర్నర్ తమిళసైకి బిఆర్ఎస్ ప్రభుత్వం చూపించిన వైఖరిని ఏమంటారో?

**ప్రోటోకాల్ పాటించకుండా ఉండటం మహిళలను అగౌరించడం కాదా...?**

**అసెంబ్లీ సమావేశాలను బిఆర్ఎస్ నాయకులు పక్కదారి పట్టిస్తున్నారు...**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు మహిళల పక్షపాతి...**

**ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్...**



కూకట్‌పల్లి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరుగుతున్న చర్చను కావాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మహిళలను గౌరవించడం లేదని అనడం సమంజసం కాదని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అన్నారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ మహిళల ఆత్మ గౌరవం కోసం మహిళకు ఉచిత బస్ ప్రయాణం, గృహాజ్యోతి ద్వారా మహిళలకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా 2500 రూపాయలు ఇవ్వడం, మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించడం, ఇందిరా శక్తి అని టిఫిన్ సెంటర్లు ప్రారంభించడం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు అందిస్తూ మహిళలను అభివృద్ధి పథంలో నడిపించాలని, ఆత్మ గౌరవంతో బ్రతకాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నాడని అన్నారు. అలాంటి రేవంత్ పై అసత్య ప్రచారాలు చేస్తూ, మహిళలకు కించపరిచాడు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగాలని ఇందిరా శక్తి ద్వారా మీ సేవ కేంద్రాలను మహిళలకు కేటాయించి జీవనోపాధి కల్పించాలని చూస్తున్న సీఎంని అనడం విడ్డూరం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసెంబ్లీ సమావేశాల్లో, బడ్జెట్ సమావేశాల్లో సీఎం పై ఎలాంటి చిన్న తప్పులకు అవకాశం ఇవ్వకుండా చాలా స్పష్టంగా బడ్జెట్ కేటాయించడంజరిగిందని అన్నారు. అన్ని వర్గాలకు, రైతు రుణమాఫీ చేసి రైతుల సంబరాల్లో పాలు పంచుకుని, రైతన్నకు అండగా నిలబడ్డాడని తెలిపారు. ప్రజల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వస్తున్న కర్తి, ప్రతిష్టలు పతాక స్థాయికి చేరగా ఓర్చుకోలేని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలని అసత్య ప్రచారాలు చేస్తూ, దిష్టి బొమ్మలు దగ్ధం చేయాలని చూస్తున్నారు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో హోంమంత్రిగా పని చేసిన సబిత ఇంద్రారెడ్డి తన స్వార్థం కోసం కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని విడి బిఆర్ఎస్ పార్టీలో చేరిందని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మోసం చేసిందని, అలాగే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా సబిత ఉన్నప్పుడు కెసిఆర్ సిగ్గు లేదా అని అసెంబ్లీ సాక్షిగా అన్నప్పుడు ఎటు వెళ్ళారు మీరంతా అని ప్రశ్నించారు. తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర్య రాజన్ ములుగు జిల్లాకు వచ్చినపుడు కనీసం ప్రోటోకాల్ కూడా పాటించకుండా అంకారపూరితంగా వ్యవహరించింది టిఆర్ఎస్ పార్టీ కాదా అని అన్నారు. చేసిన బి.ఆర్.ఎస్. పార్టీ అని అన్నారు. అలాంటి వారు మహిళల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. మహిళలను గౌరవించడం టిఆర్ఎస్ నాయకులను నేర్చుకొమ్మని హితవు పలికారు.



హత్యకు గురైన రేణు బాబు

## బండ్లగూడ ఎక్సైజ్ అకాడమీ సమీపంలో రేణుబాబు అనే వ్యక్తి దారుణ హత్య

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం): మూడు సంవత్సరాలుగా భార్య, పిల్లలకు దూరంగా తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన బండ్లగూడ సమీపంలోని ఎక్సైజ్ అకాడమీ వెనుక భాగంలో గురువారం ఉదయం జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి . రేణు బాబు, రమ్య లు భార్యాభర్తలు . వీరికి 13, 11 సంవత్సరాల వయసు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి కుటుంబంలో వచ్చిన మనస్పర్థలు కారణంగా మూడు సంవత్సరాలుగా భార్యాభర్తలు వేరువేరుగా ఉంటున్నారు. రేణు బాబు తల్లిదండ్రుల వద్ద ఉంటుండగా, రమ్య సన్ సిటీలో నివాసం ఉండే వారి కుటుంబ సభ్యుల వద్ద ఉంటుంది.

### హత్యకు గురైన రేణుబాబు :

బండ్లగూడ వద్ద గల ఎక్సైజ్ అకాడమీ వెనుక భాగంలో రేణుబాబు గురువారం హత్యకు గురయ్యాడు. ముఖం పై విచక్షణ రహితంగా కొట్టి హత్య చేశారు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు : డిఈ రత్నాకర్ రావు

### విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

రాజేంద్రనగర్, ఆగస్టు 1(ప్రభాత ఉదయం) విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ పి రత్నాకర్ రావు తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ శివ సాయి కాలనీలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ హాథిరాం, శ్రీనివాస్ లతో కలిసి పర్యటించి విద్యుత్ వినియోగదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు నిరంతర విద్యుత్తును అందజేస్తుందని సకాలంలో వినియోగదారులు బిల్లులు చెల్లించి సంస్థ అభ్యున్నతికి తోడ్పాటున అందించాలన్నారు.



బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని రాజీవ్ గృహకల్ప భవన సముదాయం వద్ద విద్యుత్ సమస్యలను పరిశీలిస్తున్న డిఈ రత్నాకర్ రావు




బుద్వేల్ శివ సాయి కాలనీలో విద్యుత్ పరిశీలిస్తున్న డి ఈ రత్నాకర్ రావు



హనుమాన్ దేవాలయం వద్ద భక్తులు.

చిత్రంలో రెవల్లి రవి శర్మ పూజారి, వై. శ్రీధర్ తదితరులు

## హనుమాన్ దేవాలయం పునరుద్ధరణ కొరకు సమావేశం

రాజేంద్రనగర్ అంబేద్కర్ నగర్ కాలనీ, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు పురాతన హనుమాన్ దేవాలయం ను పునరుద్ధరణ కార్యక్రమం కొరకు గురువారం భక్తులు సమావేశం నిర్వహించారు. మొట్ట మొదట సమావేశం హనుమాన్ దేవాలయం ప్రాంగణం లో జరిగింది. ఈ కార్యక్రమానికి రెవల్లి రవి శర్మ పూజారి మార్గదర్శనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, అబేడ్కర్ సంఘం సలహాదారు పచ్చ శ్రీనివాస్, కిరోసిన్ రాజు, భీమయ్య , .యం జంగయ్య, జ్ఞానేశ్వర్, వెంకటేష్ , మహేష్. రవి. సాయి ఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఆదివారం ఉదయం 8 గం లకు బస్తీ లోని భక్తులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# కాటేదాన్‌లో చోరికి పాల్పడ్డ ముఠాలోని నలుగురు సభ్యుల అరెస్ట్

### రూ.16 లక్షలు స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్.. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు, వాహనం

బుద్వేల్, ఆగస్టు1(ప్రభాత ఉదయం): కాటేదాన్ లోని భారతి ట్రేడర్స్ అనే బ్యాటరీ రీసైక్లింగ్ కంపెనీలో జులై 21న తెల్లవారు జామున వాచ్మెన్లను బెదిరించి రూ. 50 లక్షలు దోచుకెళ్లిన 11 మంది సభ్యుల గల గ్యాంగ్ లో నలుగురు వ్యక్తులను సైబరాబాద్ ఎస్ఓటి, శంషాబాద్ ఎస్ఓటి పోలీసులు , మైలార్ దేవుపల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ. 16 లక్షల నగదు, ఒక ఇన్నోవ కారు, ఒక మోటార్ సైకిల్ , నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాజేంద్రనగర్ లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు..... జూలై 21న తమ కంపెనీలో దొంగలు పడ్డారని , బీరువాలో దాచిన రూ.50 లక్షలు దోచుకెళ్లాలరని, అడ్డు చెప్పిన వాచ్మెన్లు నరేష్ కుమార్, కిషన్ లను కత్తులు, రాడ్ లతో బెదిరించి పారిపోయారని ఆ కంపెనీ యజమాని మహేందర్ కుమార్ మైలార్ దేవ్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా దృష్టి మళ్లించి డబ్బు దోచుకెళ్లే ముఠా ఈ దొంగతనానికి పాల్పడ్డట్లు తెలుసుకున్నారు. అత్తాపూర్ లో ఇటీవల దృష్టి మళ్లించి తొమ్మిది లక్షలు దోచుకెళ్లిన వ్యక్తులపై నిఘా పెట్టి ఆరా తీయగా కాటేదాన్ చోరీ విషయం బయటకు వచ్చింది. దీంతో మైలార్ దేవ్ పల్లి ఓవైసీ హిల్స్ కు చెందిన షేక్ మహమ్మద్ అఖిల్( 25), ముస్తఫా నగర్ కు చెందిన షేక్ అద్నాన్ (21), మొహమ్మద్ సైఫ్( 25 ), వట్టేపల్లి చెందిన సయ్యద్ మోసీన్ (28) లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 16 లక్షలు స్వాధీనం చేసుకున్నారు . 4 మొబైల్ ఫోన్లతో పాటు ఒక కత్తి, ఒక సుత్తి, అద్దెకు తీసుకుని నెంబర్ ప్లేట్ మార్చిన ఏపీ 15 ఏ ఎన్ 0006 నెంబర్ ఇన్నోవా కారు, హొండా షైన్ మోటార్ సైకిల్ ఏపీ 12 ఎన్ 9329 లను స్వాధీనం చేసుకున్నారు . ఈ కేసులో సంబంధం ఉన్న ఏడుగురి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ నరేందర్ లు ఉన్నారు.

## అసెంబ్లీలో ముఖ్యమంత్రి మహిళల పట్ల అగౌరవ వ్యాఖ్యలు

# అహంకార పూరిత ధోరణికి నిదర్శనం

### కార్పొరేటర్లు శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు



కూకట్‌పల్లి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం) మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కెపిహెచ్బి డివిజన్ లోని టెంపుల్ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కార్పొరేటర్ పగుడాల శిరీష బాబు రావు, బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, నాయకులు కార్యకర్తలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సీనియర్ నాయకులైన సబితా ఇంద్రారెడ్డిని అవమానపరచే విధంగా మాట్లాడడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార పూరిత ధోరణికి నిదర్శనమని, గడిచిన తొమ్మిది నెలల కాలంగా ఢిల్లీ పర్యటన తప్ప తెలంగాణ అభివృద్ధికి ఎక్కడా దోహదపడే అంశాలు లేవని అన్నారు. ఇవన్నీ కూడా తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారు: మంత్రి జూపల్లి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1(ప్రభాత ఉదయం)గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి జిల్లా నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారని గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరాడని తెలిపారు.కృష్ణ మోహన్ రెడ్డి కేటీఆర్ ని కలవడం కేవలం పాత పరిచయాల వల్లనే కలిశారు. కాంగ్రెస్ లోనే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కొనసాగుతారని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మార్పు వ్యవహారం గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఇంటి దగ్గర మంత్రి జూపల్లి కృష్ణారావు , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడుతూ... జూరాల బ్యాక్ వాటర్ లో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ కు మరో రెండు టీఎంసీల నీళ్లు కేటాయిస్తున్నట్టు సీఎం హామీ ఇచ్చారు.. మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవం అసెంబ్లీ లాబీల్లో ఇంతకు ముందు పరిచయం ఉన్న వారితో మాట్లాడడం తప్పేం కాదు, అలా మాట్లాడినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు కాదని మంత్రి జూపల్లి అన్నారు.జూలై 30 కెటిఆర్ ను ఎమ్మెల్యే స్నేహపూర్వక వాతావరణంలోనే కలిసాడు.కాంగ్రెస్ ను వీడి బిఆర్ఎస్ లో చేరారు అంటున్న వార్తల్లో వాస్తవం లేదు. ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి వుంటుందని తెలిపారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే అసెంబ్లీకి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## అత్యంత కీలకమైన సమస్య పరిష్కరణకు బాటలు వేసిన ప్రధానమంత్రికి కృతజ్ఞతలు

### తెలంగాణ బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి

30 ఏళ్లుగా కలలు కంటున్న Sc వర్గీకరణ అంశంలో చీరవ తీసుకుని,న్యాయమైన చిక్కులు పరిష్కరించి,తెలంగాణ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన మాటని నిలబెట్టుకున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ కి తెలంగాణ బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఎన్నికల సందర్భంగా ఎన్నోసార్లు ప్రధాని నరేంద్ర మోడీ వర్గీకరణ సమస్య పరిష్కారం కోసం ప్రతిపాదించారని,బీజేపీ ప్రభుత్వం వల్ల,అసాధ్యం ఏమో అనుకున్న వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పుతో పరిష్కరణ అయింది అని అన్నారు.బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, మరియూ ఉపాధ్యక్షురాలు డి కె అరుణ కు ఈసందర్భంగా బాల్ రెడ్డి కృతజ్ఞతలు,శుభకాంక్షలు తెలియజేసారు.




బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

## సీఎం రేవంత్ రెడ్డి మహిళ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నాయకులు నిరసన

### అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

### ముఖ్యమంత్రి వ్యవహార శైలి ఇకనైనా మార్చుకోవాలని గాడిల నవీన్ డిమాండ్

కొత్తకోట, ఆగస్టు1(ప్రభాత ఉదయం) బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ,మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ల పిలుపుమేరకు.. బుధవారం అసెంబ్లీలో బిఆర్ఎస్ మహిళ మాజీ మంత్రి సబితా ఇంద్రరెడ్డి మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పై కొత్తకోట చౌరస్తాలో నిరసన తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేయకుండా టిఆర్ఎస్ నాయకులు నవీన్ , మండల యూత్ నాయకులను మందస్తు అరెస్టు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ మహిళల పట్ల అగౌరవంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల అసెంబ్లీ లో ముఖ్యమంత్రి భాష వ్యవహార శైలికి ఇకనైనా మార్చుకోకపోతే ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు, అరెస్టుల ద్వారా నిరసనలను అడ్డుకోలేరని ప్రభుత్వం గుర్తుంచుకోవాలనీ, దేవరకద్ర మాజీ శాసనసభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి పిలుపుమేరకు నిరంతరం ప్రజలకు మద్దతుగా ధర్నాలు, నిరసన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు చేయడానికి గానీ ఏమాత్రం వెనుకాడబోమని గుర్తుంచుకోవాలన్నారు..

## వీది కుక్కల స్వైరవిహారం

గద్వాల,ఆగస్టు 1(ప్రభాత ఉదయం)గద్వాల మున్సిపాలిటి పలు వార్డుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ఎదురు వచ్చిన వారి వెంటపడుతూ కరుస్తున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపై నడవాలంటే జంకుతున్నారు. చిన్నారులను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గురువారం గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు హమాలీ కాలనీలో వీధి కుక్కల దాడిలో హస్మిత, రిషీ చిన్నారులకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారుల పై వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో ఇద్దరు చిన్నారులకు తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీధి కుక్కలను తరిమికొట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



## గామాభివృద్ధికి చేసిన సేవ మరువలేనిది

### బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శిని మహేందర్ కి ఘనంగా వీడ్కోలు సన్మానం

మొయినాబాద్ ఆగస్టు 01 ( ప్రభాత ఉదయం ) మండల పరిధిలోని చిన్నమంగళరం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన మహేందర్ సేవలు మరవలేనివని.. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చాలా కృషి చేశారని చిన్న మంగళారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు అన్నారు మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బదిలీ పై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి మహేందర్ కి చిన్న మంగళవారం గ్రామపంచాయతీ పాలకవర్గం పువ్వులు బొకే ఇచ్చి ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ మా గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అలాంటి వారు ఇటీవల బదిలీపై వెళ్లడం ఒకపక్క బాధాకరం మరోపక వృత్తి పట్ల బదిలీపై వెళ్లడం సంతోషకరంగా ఉన్నదని అన్నారు.గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలో ఏ సమస్యలు ఉన్న వారి దృష్టికి రాగానే పరిష్కారం అయ్యో విదంగా కృషి చేసే వారని చెప్పారు.గత 5 ఏండ్లలో చిన్న మంగళారం గ్రామంలో జరిగిన అభివృద్ధిలో కీలక పాత్ర తను ఒక్కరై పాల్గొని సేవలందించారని తెలిపారు.అలాంటి వారు బదిలీ కొంత బాధగా కల్గిస్తుందని,ఏ ప్రభుత్వ ఉద్యోగంలోనైనా బదిలీలు సహజమని, కానీ తాను చేసే పనితీరుపు బట్టి అక్కడి ప్రజల మనసులో ఉండిపోతారన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామాని అభివృద్ధి పథంలో నడుపుతూ సేవలందించి గ్రామ ప్రజల మన్ననలు పొందాలని గ్రామ ప్రజల చెప్పుకొచ్చారు ఈ కార్యక్రమం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు



## సుప్రీంకోర్టు తీర్పుపై ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ నాయకుల సంబరాలు

కూకట్‌పల్లి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం) మాదిగల చిరకాల కోరిక ఎస్సీ, ఎస్టీ, ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున, తెలంగాణ రాష్ట్రంలోఎస్సీ వర్గీకరణ ను వెంటనే అమలు చేస్తామని ప్రకటించిన శుభసంధర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఎల్లమ్మ బండ పిజెఆర్ నగర్ లో గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బ్యాండు బాజాలతో నృత్యాలు చేస్తూ టపాకాయలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు జోహార్లు తెలియజేశారు. గత 30 సంవత్సరాలుగా ఉద్యమపోరాటం చేసిన పలు సంఘాల నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పిఎల్ ప్రసాద్, నిక్సార్, బుల్లెట్ రవి, కొత్తదొడ్డి జాన్, సి.మల్లేష్, పాలడుగు జానయ్య, గుడ్ల శ్రీనివాస్, జగదీష్, కర్నాటక రాజు, సురేష్, మహేష్, గిరి, ఆదర్శ్, సాయి, ప్రసాద్, చంద్రయ్య, చెన్నయ్య, సిద్దయ్య, సామ్యూల్, కృష్ణ, ఇంత్యాజ్, సుధాకర్, స్టీవెన్, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ద్వారా దోమల వృద్ధిని అరికట్టాలి

### పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్ర రెడ్డి

కూకట్‌పల్లి, ఆగస్టు 1 (ప్రభాత ఉదయం) ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ దోమల వృద్ధిని అరికట్టాలని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేన లు తెలిపారు. కూకట్ పల్లి సర్కిల్ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో దోమల నివారణ వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమ ర్యాలీని వారు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి సిబ్బంది, మహిళ మండలి సిబ్బంది, స్థానిక నేతలు, మహిళల తో కలిసి విధుల్లో తిరుగుతూ స్థానికులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరల్లో నిల్వ ఉండే వ్యర్థ నీటిని వెంటవెంటనే తొలగించాలన్నారు. మురుగు నీటితో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంట్లో పేరుకుపోయే చెత్తాచెదరాన్ని నిత్యం ఇంటిముందుకు వచ్చే చెత్త రిక్షాల్లో వేయాలన్నారు. దోమకాటు ద్వారా వచ్చే రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు ముందుగానే జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. ర్యాలీలో సీఓ సుజాత, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు టి. పద్మావతి, వి. శోభరాణి, రేణుక, పి.లక్ష్మి, కె.పద్మ, ఏ.వెంకటలక్ష్మి, ఎస్.సులొచన ఎంటోమోలజీ సిబ్బంది నరేష్ , ఆర్పిలు రాణి, స్వర్ణ, స్వాతి, స్వప్న, సరిత, సంగీత, ప్రమీల, రమాదేవి, పద్మావతి, కవిత, రాధ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.




Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.